క్లుప్తంగా

నేడు పైడితల్లి సిరిమానోత్సవం

డెంకాడ: పైడితల్లి పండగ మహోత్సవంలో భాగంగా మండలంలోని అక్కివరం గ్రామంలో మంగళవారం జరిగే సిరిమానోత్సవానికి సోమవారం ఏర్పాట్లు పూర్తి చేశారు. 120 ఏళ్ల తర్వాత ఈ ఉత్సవం నిర్వహిస్తుండడంతో గ్రామస్తులు, గ్రామపెద్దలంతా కలిసి ఎంతో అట్టహాసంగా చేసేందుకు సమాయత్తమయ్యారు. సోమవారం తొలేళ్ల ఉత్సవం జరగ్గా, మంగళవారం జరిగే సిరిమానోత్సవానికి పెద్ద ఎత్తున భక్తులు రానుండడంతో వారికి ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేశారు. ముఖ్యంగా సిరిమాను ఊరేగింపులో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా గట్టి పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

వైభవంగా చందనోత్సవం

విజయనగరం: మండలంలోని దుప్పాడ శ్రీక్షేత్రంలో చందనోత్సవం సోమవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. వైశాఖ శుద్ధ పౌర్ణమి పురస్కరించుకుని, అష్టలక్ష్మి సమేత ఐశ్వర్య వేంకటేశ్వరస్వామికి తొలుత ప్రత్యేక పూజలు చేసి, ఆ తర్వాత ఆలయ అర్చకులు స్వామి వారి విగ్రహానికి చందనం పూసి భక్తులకు దర్శనం కల్పించారు. కార్యక్రమంలో అర్చకులు చామర్తి రమేష్‌చార్యులు, అంపోలు లక్ష్మీనరసింహాచార్యులు, ఆలయ ధర్మకర్తలు దుర్గాబాలాజీ, ఉమాదేవి తదితరులు పాల్గొన్నారు.

చక్కెర కార్మికులను ఆదుకోండి

విజయనగరం గంటస్తంభం: విజయనగరం జిల్లా భీమసింగి సుగర్ ఫ్యాక్టరీ కార్మికులు ఆకలితో చనిపోతున్నారని, రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి కార్మికులు, ఉద్యోగుల కుటుంబాలను ఆదుకోవాలని రాష్ట్ర సెర్ప్, సూక్ష్మ, మధ్య తరహా పరిశ్రమలు మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌ను లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ కోరారు. మంత్రి క్యాంపు కార్యాలయంలో సోమవారం కార్మిక సంఘాల నేతలతో మంత్రిని కలిసి కార్మికుల ఆవేదనను వినిపించారు. భీమసింగి సుగర్ ఫ్యాక్టరీ కార్మికులకు పీఎఫ్, గ్రాట్యుటీ చెల్లించాలన్నారు. ఆర్థిక పరిస్థితులతో కార్మికుల పిల్లలు చదువుకు దూరమవుతున్నారన్నారు. దీనిపై మంత్రి కొండపల్లి శ్రీనివాస్ స్పందిస్తూ సమస్యను సీఎం దృష్టికి తీసుకెళ్తానన్నారు. కార్యక్రమంలో కార్మిక సంఘాల నాయకులు ఉంగరాల శ్రీను, దాలినాయుడు, పిన్నింటి కృష్ణ, ఆదిబాబు, ఎర్రినాయుడు, అబ్బాస్, వెంకటరావు, సాయి, జగన్నాథం, రాము, శ్రీను, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం.. ప్రాణదానం

విజయనగరం ఫోర్ట్: రక్తదానం ప్రాణదానంతో సమానమని, ప్రతిఒక్కరూ రక్తదానానికి ముందుకురావాలని తిరుమల మెడికవర్ ఎండీ కె.తిరుమలప్రసాద్ కోరారు. అంతర్జాతీయ నర్సుల దినోత్సవంలో భాగంగా స్థానిక తిరుమల నర్సింగ్ కళాశాలలో గాంధీ బ్లడ్ డోనర్స్ క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. పలువురు యువత శిబిరానికి హాజరై రక్తం దానం చేశారు. రక్తదాతలను ఉద్దేశించి ఆయన కాసేపు మాట్లాడారు. రక్తం దానం చేస్తే అనారోగ్యం పాలవుతామనే అపోహ వీడాలన్నారు. మనమిచ్చే రక్తం మరొకరి ప్రాణం కాపాడుతుందన్న విషయం గుర్తుంచుకోవాలన్నారు.

యుద్ధప్రాతిపదికన తాగునీటి బోర్లు మరమ్మతులు


పాడైన బోరును బాగు చేస్తున్న మెకానిక్‌లు

విజయనగరం: నగరంలోని పాడైన తాగునీటి బోర్లు మరమ్మతులు పనులు యుద్ధప్రాతిపదికన జరుగుతున్నాయి. కంప్రెషర్ ద్వారా ఫ్లషింగ్ పనులు చేసి, ఎయిర్ బ్లాక్స్, సిల్ట్‌లు తొలగించి స్వచ్ఛమైన జలం వచ్చేలా చర్యలు తీసుకుంటున్నారు. ప్రస్తుతం జరుగుతున్న తాగునీటి సరఫరా పునరుద్ధరణ పట్ల స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

చెరువు.. పరిశుభ్రం


చెరువు పరిసరాల పరిశుభ్రతలో నిమగ్నమైన పారిశుధ్య సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్...

విజయనగరం జిల్లా కేంద్రంలోని పెద్ద చెరువు వ్యర్థాలతో నిండి ఉండడంపై 'మరీ ఇంత అధ్వానమా' శీర్షిక పేరిట ఈ నెల 10వ తేదీన సాక్షి దిన పత్రికలో ఫొటో ఫీచర్ ప్రచురితమైంది. ఈ మేరకు సంబంధిత అధికారులు స్పందించి, చెరువు శుభ్రపరిచే కార్యక్రమానికి చర్యలు తీసుకున్నారు. పారిశుధ్య సిబ్బందితో చెరువు పరిసరాల్లోని చెత్తాచెదారం, పిచ్చిమొక్కలు తొలగింపజేశారు. ప్రస్తుతం చెరువు శుభ్రంగా ఉండి, ఆహ్లాదం పంచుతుండడంతో స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. – సాక్షి ఫొటోగ్రాఫర్, విజయనగరం



సాక్షి దినపత్రికలో ప్రచురితమైన పేపర్ క్లిప్పింగ్

తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకోండి


పాఠశాలల విలీనంపై ప్రశ్నిస్తున్న ఎంపీటీసీ అప్పలనాయుడు

- మండల సర్వసభ్య సమావేశంలో సభ్యుల డిమాండ్



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాగమాధవి

పూసపాటిరేగ: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం సోమవారం జరిగింది. ఎంపీపీ మహంతి కల్యాణి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి ఎమ్మెల్యే లోకం నాగమాధవి హాజరు కాగా, మండల పరిధిలో తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకోవాలని పలువురు సభ్యులు ఎమ్మెల్యేను కోరారు. పూసపాటిరేగకు కొత్త రక్షిత మంచినీటి పథకం మంజూరు చేయాలని సర్పంచ్ టొంపల సీతారాం కోరారు. ఈ మేరకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారి హేమంత్‌కుమార్‌ను ఎమ్మెల్యే ఆదేశించారు. అల్లాడపాలెం రక్షిత మంచినీటి పథకం మోటార్ విద్యుత్ బిల్లు రూ.12 లక్షలు వచ్చిందని, ఆ బిల్లు మంజూరు చేయాలని వైస్ ఎంపీపీ అల్లాడ రమేష్ అధికారులకు విజ్ఞప్తి చేశారు. దీనిపై సమీక్ష నిర్వహించి, చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే సమాధానమిచ్చారు. మర్రిపేట ప్రాథమిక పాఠశాలను పసపాం పాఠశాలలో కలపడం వల్ల అక్కడి విద్యార్థులు 2 కిలోమీటర్ల దూరంలోని పాఠశాలకు నడిచి వెళ్లాల్సిన దుస్థితి ఏర్పడిందని, ఇదేం విధానమని పతివాడ ఎంపీటీసీ సభ్యుడు పతివాడ అప్పలనాయుడు ఎంఈవోను నిలదీశారు. పాఠశాల విలీనంపై పునరాలోచించి విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా చూస్తామని ఎంఈవో హామీ ఇచ్చారు. అల్లాడపాలెం జాతీయ రహదారిని కొంతమంది ఆక్రమించారని వైస్ ఎంపీపీ రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేయగా, దానిపై విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. రహదారి పొడవునా రోడ్డుకు ఇరువైపులా ఉండే చెట్లను ఫారెస్ట్, విద్యుత్ శాఖ అధికారులు నరివేస్తుండడం జరుగుతోందని, ఆ పనులకు స్వస్తి పలకాలని ఎమ్మెల్యే కోరారు. ఇదిలా ఉంటే గ్రామాల్లో జరిగే ఏ కార్యక్రమం గూర్చి సర్పంచ్‌లకు సమాచారం ఇవ్వడం లేదని వెంపడాం సర్పంచ్ పిన్నింటి కుమార్ ఫిర్యాదు చేశారు. వేసవిలో ప్రజలు రోగాల బారినపడకుండా అప్రమత్తంగా ఉండి చర్యలు తీసుకుంటున్నట్లు రెల్లివలస వైద్యాధికారి బాగ్యరేఖ తెలిపారు. ఖరీఫ్ సాగుకు ముందు భూసారానికి నవధాన్యాలు సాగు చేసేలా రైతులకు అవగాహన కల్పిస్తున్నట్లు వ్యవసాయ శాఖ అధికారిణి కె.నీలిమ వెల్లడించారు. సమావేశంలో జెడ్పీటీసీ సభ్యులు మహంతి సీతాలక్ష్మి, ఎంపీడీవో ఎం.రాధిక, డిప్యూటీ తహసీల్దారు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అన్నమాచార్యుని జయంతి


అన్నమాచార్యుని కీర్తనలు ఆలపిస్తున్న గాయకుల బృందం

విజయనగరం టౌన్: స్థానిక కొత్తపేట బుక్కా వీధిలో ఉన్న ఆర్యసోమయాజుల కాశీపతిరావు స్మారక భవనంలో ఫ్రెండ్స్ ఫైన్ ఆర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పదకవితా పితామహుడు తాళ్లపాక అన్నమాచార్యులు జయంతి సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చేపట్టిన అన్నమాచార్య సంకీర్తనల ఆలాపన ఆద్యంతం వీక్షకులను ఆకట్టుకుంది. స్థానిక సంగీత విద్వాంసులు పద్మప్రియ, మోహన్‌కుమార్, రాధాకుమారి, మెహర్‌లత, నాగేంద్రప్రసాద్, కామేశ్వరరావు, రామ్‌చరణ్, సుధాకర్, మహేశ్వరరావు, మంగతాయారు, శారదలు ఆలపించిన గీతాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. అనంతరం ఇటీవల అంతర్జాలంలో నిర్వహించిన అన్నమయ్య కీర్తనల పోటీల విజేతలను ప్రకటించారు.

విజయనగరం టౌన్: స్థానిక రింగురోడ్డులోని కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయ ఆవరణలో శ్రీవారి స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం అన్నమాచార్యుని జయంతి వైభవంగా నిర్వహించారు. సంస్థ వ్యవస్థాపకుడు ఎం.భీష్మారావు సారథ్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నారాయణం శ్రీనివాస్ పాల్గొనగా, భీష్మారావు శిష్యబృందం అన్నమయ్య సంకీర్తనామృతం, భరతనాట్యాలయం పద్మ శిష్య బృందంతో నిర్వహించిన హరిఅవతారం నృత్య రూపకం, భగవతీ నృత్య కళామందిర్ రమణకుమారి శిష్యబృందం నిర్వహించిన అన్నమయ్య జననం నృత్యరూపకం ఆద్యంతం ఆకట్టుకున్నాయి.

టీడీపీ నాయకులం.. గౌరవం ఇవ్వకపోవడమేంటి?


ఎంపీడీవో భవానీతో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు అప్పలనారాయణ, ప్రదీప్‌రాజు

డెంకాడ: తాము టీడీపీ నాయకులం..తమను గౌరవించకపోవడమేంటని మాజీ జెడ్పీటీసీ సభ్యుడు పతివాడ అప్పలనారాయణ ఆధ్వర్యంలో కొంతమంది టీడీపీ నాయకులు ఎంపీడీవో భవానిని ప్రశ్నించారు. ప్రభుత్వ, అధికారుల కార్యక్రమానికి వారిని ఆహ్వానించకపోవడంపై వారంతా ఎంపీడీవో కార్యాలయానికి సోమవారం వెళ్లి, ఎంపీడీవోను కలిశారు. తమను ఎందుకు కార్యక్రమాలకు ఆహ్వానించడం లేదని, ప్రతి గ్రామం నుంచి రెండు, మూడు పేర్లతో జాబితా ఇచ్చామని ఇప్పటివరకు ఏ ఒక్కరినీ ఆహ్వానించకపోవడం పట్ల తీవ్ర అసంతృప్తి వెళ్లగక్కారు. ఒత్తిడి కారణంగానే గతంలో ఇచ్చిన వినతిని అమలు చేయలేకపోయామని సమాధానమిచ్చారు. ఇకనుంచి అయినా తీరు మార్చుకోకపోతే భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తామని హెచ్చరించారు.

తడి, పొడి చెత్త వేర్వేరుగా ఇవ్వండి


పారిశుధ్యంపై ఆరాతీస్తున్న కమిషనర్ నల్లనయ్య

విజయనగరం: తడి చెత్త, పొడి చెత్త వేర్వేరుగా అందివ్వాలని విజయనగరం కార్పొరేషన్ కమిషనర్ పల్లి నల్లనయ్య ప్రజలకు సూచించారు. క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా నగరంలోని పలు ప్రాంతాల్లో సోమవారం పర్యటించిన ఆయన.. చెత్త తరలింపు వాహనాలు సమయానికి వస్తున్నాయా..చెత్తను ఏ విధంగా నిల్వ చేసి అందజేస్తున్నారనే విషయాలను అడిగి తెలుసుకున్నారు. అందరూ రెండు బుట్టల విధానాన్ని అవలంబించాలని, తడి చెత్త ఓ బుట్టలో.. పొడి చెత్త మరో బుట్టలో వేసి ఇంటి ముంగిటకు వచ్చే వాహనంలో పారబోయాలని తెలిపారు. అనంతరం అన్న క్యాంటీన్ వద్దకు వెళ్లి, పరిసరాల పరిశుభ్రతను పరిశీలించి అక్కడ అందిస్తున్న భోజన సదుపాయంపై ప్రజాభిప్రాయ సేకరణ చేశారు.

లేబర్ కోడ్‌లు రద్దు చేయాలి


వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న కార్మిక సంఘాల నాయకులు

విజయనగరం గంటస్తంభం: నగర పరిధిలోని తోటపాలెం ఎల్‌బీజీ భవనంలో ఈ నెల 20వ తేదీన చేపట్టే దేశవ్యాప్త సమ్మెకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను సోమవారం ఆవిష్కరించారు. కేంద్ర కార్మిక సంఘాలు–స్వతంత్ర ఫెడరేషన్స్ ఐక్యవేదిక విజయనగరం జిల్లా వారి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు పి.శంకరరావు మాట్లాడారు. ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణ, మూతపడిన పరిశ్రమల తెరిచివేత, లేబర్ కోడ్‌ల రద్దు, ఎనిమిది గంటల పని, సమాన పనికి సమాన వేతనం తదితర డిమాండ్‌ల సాధనే లక్ష్యంగా చేపడుతున్న సమ్మెను విజయవంతం చేయాలని కోరారు. బ్రిటిష్ కాలం నాడు కార్మికవర్గం పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను కేంద్రంలోని మోదీ సర్కారు 4 లేబర్ కోడ్‌లుగా మార్చి కార్మికులకు తీవ్ర అన్యాయం చేసే దిశగా చర్యలు తీసుకుంటోందని విమర్శించారు. కార్మికులకు కనీస వేతనం అమలు చేయకుండా రోజుకు కూలీకి రూ.178 ఇస్తామని లేబర్ కోడ్‌లలో పేర్కొన్నారన్నారు. ప్రస్తుతం ఆకాశాన్నంటే నిత్యావసర సరుకుల ధరలతో కనీస వేతనంగా నెలకు రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఐఎఫ్‌టీయూ, ఏఐఎఫ్‌టీయూ(న్యూ) ప్రతినిధులు అప్పలసూరి, అప్పలరాజులు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాల మూలంగా పారిశ్రామిక రంగం పూర్తిగా నిర్వీర్యమైందని విమర్శించారు. ఉపాధి లేక భవన నిర్మాణ కార్మికులుగా, వలస కార్మికులుగా సెక్యూరిటీ గార్డులుగా, హమాలీలుగా తక్కువ వేతనాలకు పనిచేయాల్సి వస్తోందన్నారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎ.జగన్మోహనరావు మాట్లాడుతూ జిల్లాలో సమ్మె విజయవంతానికి చేస్తున్న జీపు జాతా మే 14న సాయంత్రం 4 గంటలకు విజయనగరానికి చేరుకుంటుందని, ఈ నేపథ్యంలో కోట వద్ద జరిగే సభను విజయవంతం చేయాలని కోరారు. అలాగే మే 18న ఉదయం 9 గంటలకు కోట నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్ వరకు బైక్ ప్రదర్శన జరుగుతుందని, మే 20న విజయనగరం ఎస్‌బీఐ మెయిన్ బ్రాంచి నుంచి ప్రదర్శన, కోట వద్ద సభ జరుగుతుందన్నారు. సమావేశంలో అసంఘటిత రంగ కార్మిక హక్కుల సాధన సమితి కన్వీనర్ బి.గిరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సమ్మెను విజయవంతం చేయండి

నెల్లిమర్ల: ప్రభుత్వ రంగ సంస్థలు, కార్మిక హక్కుల పరిరక్షణే లక్ష్యంగా ఈ నెల 20వ తేదీన చేపట్టే దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ నాయకులు పి.శంకరరావు, కె.సురేష్, టి.వి.రమణ, బి.సుధారాణి, ఎ. జగన్‌మోహన్‌లు కోరారు. స్థానిక జ్యూట్ మిల్లు గేటు వద్ద సమ్మె జయప్రదం చేయాలని కోరుతూ జీపు జాతా సోమవారం నిర్వహించి, ప్రచారం చేశారు. వారు మాట్లాడుతూ ఈపీఎఫ్ పింఛన్ రూ.9 వేలు ఇవ్వాలని, జ్యూట్ రిటైర్డ్ కార్మికులకు గ్రాట్యుటీ, ఈఎస్ఐ, పీఎఫ్ బకాయిలు వెంటనే చెల్లించాలని, పింఛన్ సౌకర్యం కల్పించాలన్నారు. అలాగే స్కీం వర్కర్లకు ఉద్యోగ భద్రత కల్పించి, వారిని పర్మినెంట్ చేయాలని, మున్సిపల్ వర్కర్లను కూడా పర్మినెంట్ చేసి రిటైర్డ్, మృతి చెందిన వారి కుటుంబాల్లో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు కె.రామారావు తదితరులు పాల్గొన్నారు.

పూసపాటిరేగకు జీపు జాతా..

పూసపాటిరేగ: ప్రభుత్వ రంగ సంస్థలు, కార్మిక హక్కుల పరిరక్షణే లక్ష్యంగా ఈ నెల 20వ తేదీన చేపట్టనున్న దేశవ్యాప్త సమ్మె ప్రచారానికి సంబంధించిన జీపు జాతా సోమవారం మధ్యాహ్నానికి పూసపాటిరేగ చేరింది. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సురేష్ మాట్లాడుతూ సమ్మెకు అన్ని వర్గాల ప్రజలు మద్దతు తెలిపి, విజయవంతం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు పి.శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

రెడ్‌జోన్‌లో విక్రయాలు నిషేధం


సర్వే చేస్తున్న సిబ్బంది

విజయనగరం: నగరంలో వీధి విక్రయదారులు(వ్యాపారులు) గుర్తింపు సర్వే చాలా చురుగ్గా కొనసాగుతోంది. ప్లానింగ్, ఎమినిటీస్ కార్యదర్శులు.. వీధివీధిన పర్యటించి, వీధి విక్రయదారుల పేర్లు నమోదు చేస్తున్నారు. సర్వేను ఉద్దేశించి కమిషనర్ పల్లి నల్లనయ్య సోమవారం మాట్లాడుతూ ఈ నెల 14వ తేదీలోగా సర్వే పూర్తి చేయాలని, ప్రభుత్వ సూచనల మేరకు వీధివిక్రయదారులను గుర్తించి, కమిటీలను పునర్వ్యవస్థీకరించే కార్యక్రమాలు చేపట్టనున్నామన్నారు. నగరంలో రెడ్, ఆరెంజ్, గ్రీన్ జోన్లు ఏర్పాటు చేయనున్నామన్నారు. రెడ్‌జోన్‌లో విక్రయాలు నిషేధమని, ఆరెంజ్ జోన్‌లో నిర్ణీత కాలవ్యవధిలో మాత్రమే వ్యాపారాలు చేసుకునే అవకాశం ఉంటుందని, గ్రీన్‌జోన్‌లో విక్రయాలు చేసుకోవచ్చని పేర్కొన్నారు. వీధి విక్రయదారుల క్రమబద్ధీకరణకు ఈ సర్వే దోహదపడుతుందన్నారు.

ప్రభుత్వ స్థలం ఆక్రమిస్తే చర్యలు

సాక్షి ఎఫెక్ట్...


ఆక్రమిత స్థలం పరిశీలిస్తున్న ఆర్‌ఐ ఇమ్రాన్, వీఆర్వో సూరిబాబు

భోగాపురం: ప్రభుత్వ భూమిని ఎవరైనా ఆక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆర్ఐ ఇమ్రాన్ హెచ్చరించారు. మండలంలోని రాజాపులోవ గ్రామంలో సర్వే నంబరు 23లోని శ్మశానవాటిక స్థలం ఆక్రమణకు గురవుతున్నట్లు 'రెచ్చిపోతున్న కబ్జాదారులు' శీర్షిక పేరిట ఈ నెల 10వ తేదీన సాక్షి దినపత్రికలో కథనం ప్రచురితమైంది. ఈ మేరకు తహసీల్దారు సురేష్ స్పందించి, ఆక్రమణల పరిశీలనకు ఆర్ఐను ఆదేశించారు. దీంతో సోమవారం ఆ గ్రామం చేరుకున్న ఆర్ఐ.. వీఆర్వో సూరిబాబుతో కలిసి అక్కడి ఆక్రమణలను పరిశీలించారు. మొత్తం మూడు పాకలు అక్రమంగా వేసినట్లు గుర్తించామని, వాటిపై చర్యలు తీసుకుంటామన్నారు.

అమరవీరులకు జిల్లా పోలీస్ ఘనంగా నివాళులు


వీరజవాన్‌ల చిత్రపటాల వద్ద నివాళులర్పిస్తున్న రాష్ట్ర హోం శాఖామంత్రి అనిత

విజయనగరం క్రైమ్: పహల్గామ్ ఉగ్రదాడికి ప్రతీకార చర్యగా ఆపరేషన్ సిందూర్ పేరిట జమ్మూకశ్మీర్‌లో భారత సైన్యం చేసిన ఎదురుదాడిలో అమరులైన జవానులకు జిల్లా పోలీస్ శాఖ సోమవారం ఘనంగా నివాళులర్పించింది. ఈ మేరకు నగరంలోని బ్యారెక్సులోని అమరవీరుల స్థూపం వద్ద వీరులైన నలుగురు జవాన్‌లకు రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత, మంత్రి కొండపల్లి శ్రీనివాసరావు, ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యే అదితి గజపతి పుష్పగుచ్ఛాలతో నివాళులర్పించారు. దేశం కోసం ప్రాణాలు అర్పించిన వీరజవాన్‌లను మనందరికీ స్ఫూర్తిదాయకమని మంత్రి అనిత కొనియాడారు. అనంతరం బ్యారెక్సు నుంచి శాంతిని కోరుతూ కొవ్వొత్తుల ర్యాలీని మంత్రి అనిత ప్రారంభించగా ఎస్పీ కార్యాలయం నుంచి ప్రారంభమైన ఈ ర్యాలీ కలెక్టరేట్ వరకు కొనసాగింది. ర్యాలీలో ఎస్పీ వకుల్ జిందల్, ఏఎస్పీ సౌమ్యలత, ఏఆర్ ఏఎస్పీ నాగేశ్వరరావు, డీఎస్పీ శ్రీనివాసరావు, వన్‌టౌన్ సీఐ శ్రీనివాస్, రూరల్ సీఐ లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

విజయనగరం టౌన్: స్థానిక 13వ డివిజన్‌కు చెందిన 16వ సచివాలయంలో సోమవారం సంస్మరణ సభ నిర్వహించి, జవాన్ మురళీనాయక్‌కు ఘనంగా నివాళులర్పించారు. అనంతరం చిన్న వయసులోనే దేశం కోసం ఆయన పోరాడిన తీరును నాయీ బ్రాహ్మణ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు టీవీ దుర్గారావు ప్రశంసించారు. పహల్గామ్ దాడికి ప్రతీకార చర్యగా పాకిస్థాన్ ఉగ్రవాదంపై ఆపరేషన్ సిందూర్ పేరిట భారత్ జరిపిన దాడిలో మురళీనాయక్ వీరోచితంగా పోరాడి ప్రాణాలు త్యజించారని, ఆయన సేవలు ఎనలేనివన్నారు. ఆయన కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతి అని తెలిపారు. కార్యక్రమంలో రామకృష్ణ, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

• భక్తిశ్రద్ధలతో పైడితల్లి చండీయాగం


చండీయాగం నిర్వహిస్తున్న వేదపండితులు, భక్తులు

విజయనగరం టౌన్: స్థానిక వనంగుడి, చదురుగుడి ఆవరణల్లో పైడితల్లి చండీయాగం సోమవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అమ్మవారి జన్మ నక్షత్రమైన మూలా నక్షత్రం పురస్కరించుకుని, శాస్త్రోక్తంగా ఈ చండీయాగం చేపట్టారు. వేదపండితులు సాయికిరణ్, శివప్రసాద్, నరసింహమూర్తిలు యాగ విశిష్టతను భక్తులకు వివరించారు. అనంతరం యాగంలో పాల్గొన్న వారికి అమ్మవారి శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

విజయనగరం టౌన్: నగరంలో బీఎస్‌ఎన్‌ఎల్ ఎస్ఎన్‌ఈఏ నూతన కార్యవర్గం ఎన్నిక సోమవారం జరిగింది. అధ్యక్షుడిగా ఆర్‌ఎస్‌వీఎస్ శ్రీధర్, ఉపాధ్యక్షుడిగా ఎల్.శ్రీనివాసనాయుడు, జిల్లా కార్యదర్శిగా వీవీఎస్ మూర్తి, ఏడీఎస్ హెడ్ క్వార్టర్స్‌గా వీవీఎన్ మూర్తి, రూరల్‌కు కె.శంకరరావు, ఆర్గనైజింగ్ సెక్రటరీగా కె.ప్రసాద్, కోశాధికారిగా జి.శ్రీరామ్‌సంతోష్, ఆడిటర్‌గా వి.మురళీధర్ పాత్రో ఎన్నికయ్యారు. వారందరితో ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం కంది శ్రీనును ఘనంగా సత్కరించారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలివే..

డెంకాడ: మండలంలోని చింతలవలస ఏపీఎస్పీ బెటాలియన్ వద్ద ఉన్న సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాలకు మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతున్నట్లు ఏపీఈపీడీసీఎల్ ఈఈ జి.సురేష్‌బాబు ఓ ప్రకటనలో సోమవారం వెల్లడించారు. విద్యుత్ మరమ్మతుల నేపథ్యంలో చింతలవలస, ఏపీఎస్పీ బెటాలియన్, రఘుమండ, గుండాలపేట, బొడ్డవలస, కృష్ణాపురం, వెలంపేట, గెద్దవానిపాలెం, జొన్నాడ, ఆకులపేట, డి.తాళ్లవలస, దువ్వపేట, సత్యనారాయణపురం, చెల్లూరు ఇండస్ట్రియల్ ఫీడర్ ప్రాంతాలకు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు కరెంట్ సరఫరా ఉండదన్నారు. ఈ అసౌకర్యానికి చింతిస్తున్నామని, వినియోగదారులు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

వరాహ పుష్కరిణిలో పడిన బాలిక

- అపోలో ఆసుపత్రిలో చికిత్స

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానానికి చెందిన వరాహ పుష్కరిణిలో సోమవారం 11 ఏళ్ల బాలిక ప్రమాదవశాత్తు పడి తీవ్ర అస్వస్థతకు గురైంది. భక్తుల రద్దీ ఎక్కువగా ఉన్న సమయంలో ఈ ఘటన చోటు చేసుకుంది. వివరాలివి.. విజయనగరం జిల్లా చెల్లూరు సమీపంలోని బడుకొండపేట గ్రామానికి చెందిన పల్లి అప్పలనాయుడు కుమార్తె ధరణశ్రీ. సోమవారం మధ్యాహ్నం రెండు గంటల సమయంలో అప్పలనాయుడు కుటుంబసభ్యులతో పాటు సుమారు 100 మంది గ్రామస్తులు పుష్కరిణిలో స్నానం చేయడానికి వచ్చారు. ఈ క్రమంలో ధరణశ్రీ, మరో ఇద్దరు చిన్నారులతో కలిసి స్నానానికి దిగి అకస్మాత్తుగా నీటిలో పడిపోయింది. అక్కడే ఉన్న దేవస్థానం గజ ఈతగాళ్లు వెంటనే బాలికను బయటకు తీశారు. అయితే అప్పటికే ధరణశ్రీ నీటిని తాగి అపస్మారక స్థితిలోకి వెళ్లింది. కుటుంబ సభ్యులు ఆమెను వెంటనే అడవివరం ఆరోగ్య కేంద్రానికి తరలించారు. అక్కడ వైద్యులు ప్రాథమిక చికిత్స అందించిన తర్వాత కేజీహెచ్‌కు తీసుకెళ్లాలని సూచించారు. దేవస్థానం ఉద్యోగులు ఆమెను నగరంలోని అపోలో ఆసుపత్రికి తరలించగా.. ప్రస్తుతం అక్కడ చికిత్స జరుగుతోంది. ధరణశ్రీ కోలుకుంటోందని వైద్యులు చెప్పినట్లు ఆమె తండ్రి అప్పలనాయుడు తెలిపారు. దేవస్థానం ఈవో సుజాత, ఇన్‌చార్జి డీఈ హరి తదితరులు ఆసుపత్రికి వెళ్లి బాలిక ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. వరాహ పుష్కరిణి వద్ద కిక్కిరిసిన భక్తులను నియంత్రించడంలో నిర్లక్ష్యం వల్లే బాలిక నీటిలో పడిపోవడానికి కారణంగా తెలుస్తోంది.

రెండు కిలోల గంజాయితో ఇద్దరి అరెస్ట్

విజయనగరం క్రైమ్: విజయనగరంలోని గూడ్స్‌షెడ్ సమీపంలో సోమవారం వన్‌టౌన్ పోలీసులు రెండు కేజీల గంజాయిని పట్టుకున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. వన్‌టౌన్ స్టేషన్ సిబ్బంది తనిఖీలు చేస్తుండగా నగరంలోని గూడ్స్‌షెడ్ వద్ద గంజాయి సరఫరా చేస్తూ ఒడిశాలోని రాయగడకు చెందిన ఇద్దరు వ్యక్తులు పట్టుబడ్డారు. దీంతో వారిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి కోర్టుకు అప్పగించామని సీఐ శ్రీనివాసరావు తెలిపారు.